క్లుప్తంగా

రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా భాస్కర్



మైదుకూరు : సీపీఐ అనుబంధ ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మైదుకూరుకు చెందిన పోతిరెడ్డి భాస్కర్ నియమితులయ్యారు. రాజమహేంద్రవరంలో ఈనెల 9, 10, 11 తేదీల్లో జరిగిన రైతు సంఘం 18వ మహాసభల్లో ఆయనను సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తనను రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ భ్యుడిగా ఎన్నుకున్నందుకు రాష్ట్ర, జిల్లా నాయకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గం పరిధిలోని అన్ని విద్యుత్ సబ్‌స్టేషన్లలో మెయింటెనెన్స్ పనుల కారణంగా విద్యుత్‌ను నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

బద్వేలు అర్బన్ : 132/33 కె.వి. సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా బద్వేలు, గోపవరం, అట్లూరు మండలాల పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ ఏడీఈ కుళ్లాయప్ప శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి అంతరాయానికి సహకరించాలని కోరారు.

ఈసీఈలో డాక్టరేట్



అట్లూరు : బద్వేలు మండల పరిధిలోని చింతల చెరువు గ్రామానికి చెందిన అంబవరం ప్రతాప్‌రెడ్డికి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగంలో డాక్టరేట్ అందుకున్నారు. చెన్నైలోని అన్నా యూనివర్శిటీలో బీఈ పూర్తి చేసిన ప్రతాప్‌రెడ్డి అనంతరం వైవీయూ నుంచి ఎల్ఎల్‌బీలో పట్టా పొంది న్యాయవాదిగా స్థిరపడ్డారు. కాగా గుంటూరులోని విజ్ఞాన్ యూనివర్సిటీలో ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో ఇన్వెస్టిగేషన్ ఆన్ బ్యాండ్‌విడ్త్ అండ్ గేన్ ఎన్‌హ్యాన్స్‌మెంట్ ఆఫ్ మైక్రోస్ట్రిప్ ప్యాచ్ యాంటీనా ఫర్ వైమాక్స్ – 5జీ – డబ్ల్యూలాన్ అప్లికేషన్స్ అనే అంశంపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్‌ను ప్రకటించారు. ఈ నెల 8న విజ్ఞాన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, ఆయా విభాగాల అధిపతులు డాక్టరేట్ ప్రదానం చేశారు.

నేడు డయల్ యువర్ డీఎం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు ఆర్టీసీ డిపో కార్యాలయంలో శనివారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ మల్లికార్జునరెడ్డి తెలిపారు. డిపో పరిధిలోని ప్రయాణికులు తమ సమస్యలను, సలహాలను, సూచనలను సెల్ నంబర్ 9959225777కు ఫోన్ చేసి చెప్పవచ్చని ఆయన సూచించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా కుడారై ఉత్సవం



పూజాకార్యక్రమంలో నివేదించిన పాయసం మట్టికుండలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస పూజలో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేసి కుడారై ఉత్సవాన్ని నిర్వహించారు. తెల్లవారుజామునే మహిళలు ఆలయానికి చేరుకుని ముగ్గులు వేసి దానిపై దీపాలు వెలిగించారు. శ్రీకృష్ణుడు, గోదాదేవి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి పూలతో అలంకరించారు. శ్రీకృష్ణునికి ప్రీతిపాత్రకరమైన 108 మట్టి పాత్రల్లో బెల్లంపొంగలి పోసి నివేదించారు. కాగా ఆదివారం ఉదయం గోదాదేవి రంగనాయకుల స్వామి కళ్యాణోత్సవం జరుగుతుందని కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ

ప్రొద్దుటూరు : మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు శుక్రవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి దుస్తులు పంపిణీ చేశారు. 232 మంది కార్మికులకు ఫ్యాంట్, షర్ట్, టవాళ్లు, చీరెలు, చెప్పులు, కొబ్బరి నూనె అందించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవి, 25వ వార్డు ఇన్‌చార్జి నూరి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నూర్ అహ్మద్, కిరణ్ పాల్గొన్నారు.

ఎస్సీలకు రిజర్వేషన్లకు మించి మంత్రి పదవులు

- అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ఎస్సీలంతా తరలి రావాలి
- ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మైదుకూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీలకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లకు మించి మంత్రి పదవులను ఇచ్చారని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. విజయవాడలో ఈనెల 19వ తేదీన అంబేడ్కర్ స్మృతి వనం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం నాయకులతో కలసి ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అంబేడ్కర్ స్మృతి వనానికి సంబంధించిన పోస్టర్లను నాయకులు, కార్యకర్తలతో కలసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. చంద్రబాబు హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు పెద్దగా ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. ఎస్సీలకు ఐదుగురికి మంత్రి పదవులు ఇచ్చిన ఘనత వైఎస్ జగన్‌దేనన్నారు. అందులో ఒకరిని డిప్యూటీ సీఎం చేశారన్నారు. చంద్రబాబు ఆరుగురు బీసీలకు మంత్రి పదవులు ఇస్తే, వైఎస్ జగన్ 10 మందికి మంత్రి పదవులు ఇచ్చారన్నారు. చంద్రబాబు ఒక్క ఎస్టీ వర్గానికి చెందిన వ్యక్తికి కూడా మంత్రి పదవి ఇవ్వలేదని విమర్శించారు. తన కుమారుడిని ఎమ్మెల్సీని చేసి మంత్రి పదవి ఇచ్చిన చంద్రబాబు, ఎస్టీలకు ఆ విధంగా ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఎస్సీలకు రాజ్యాంగంలో రిజర్వేషన్లు కల్పించిన అంబేడ్కర్‌ను గౌరవిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి అంబేడ్కర్ స్మృతి వనాన్ని నిర్మించారని కొనియాడారు. ఏ రాష్ట్రంలోనూ ఏ ప్రభుత్వం కూడా అంబేడ్కర్‌ను ఇంతగా గౌరవించలేదన్నారు. అంబేడ్కర్ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తే దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి మైనారిటీలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించారని తెలిపారు. దీని వల్ల ఎంతో మంది ఇంజనీర్లు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు అయ్యారన్నారు. చంద్రబాబు హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు న్యాయం జరగలేదని ఆరోపించారు. అంబేడ్కర్ స్మృతి వనం ప్రారంభోత్సవానికి నియోజకవర్గంలోని ఎస్సీ సోదర, సోదరీమణులందరూ కదలి రావాలని, విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సచివాలయ ఉద్యోగాల్లోనూ బలహీన వర్గాల వారికి ప్రాధాన్యత ఇచ్చారన్నారు. సమావేశంలో మైనారిటీలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించడం వల్లే తనకు ఇంజనీరింగ్ సీటు వచ్చిందని ఇంజనీరింగ్‌లో ఫ్రీ సీటు వచ్చిందని తాసిన్ అనే ఇంజనీరింగ్ విద్యార్థి వెల్లడించాడు. జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన కల్పిస్తూ మైనారిటీ వర్గాల వారిని ఆదుకుంటున్నారని తెలిపారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా నాయకురాలు, మున్సిపల్ కౌన్సిలర్ ఇందిరా రమణి, ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు వినోద్ కుమార్, ఎస్సీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి జేష్టాది రవికుమార్, కౌన్సిలర్ వెంకటసుబ్బన్న, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ డి.గంగాధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, గంగాధర్, శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ యువజన దినోత్సవం

వైవీయూ: కడప నగరంలోని పలు విద్యాసంస్థల్లో జాతీయ యువజన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో స్వామి వివేకానందుని చిత్రపటానికి వైస్ చాన్సలర్ ఆచార్య బి. ఆంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ యువతకు స్వామి వివేకానందుడు ఆదర్శప్రాయుడన్నారు. యువతలో ధైర్యం నూరిపోసిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఆయన మార్గం నడుస్తూ ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు , అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

– ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో స్వామి వివేకానందుని చిత్రపటానికి ప్రిన్సిపాల్ డా. వేమల సలీంబాషా పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయనతోపాటు పలువురు అధ్యాపకులు స్వామి వివేకానందుని గురించి ఉపన్యసించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. గురివిరెడ్డి పాల్గొన్నారు.

మండల స్థాయిలో ముగిసిన ‘ఆడుదాం ఆంధ్రా’



గోపవరం : బ్రాహ్మణపల్లె టీంకు మెమెంటోను అందజేస్తున్న సర్పంచ్, అధికారులు



పోరుమామిళ్ల : విజేతను ప్రకటిస్తున్న స్పెషల్ ఆఫీసర్



బి.కోడూరు: రామసముద్రం జట్టును అభినందిస్తున్న ఎంపీడీఓ

గోపవరం : ఆడుదాం ఆంధ్రాకు సంబంధించి గ్రామ, మండల స్థాయి క్రీడలు శుక్రవారంతో ముగిశాయి. మండల స్థాయిలో విన్నర్‌గా ఎంపికైన టీంలు నియోజకవర్గ స్థాయిలో ఆడనున్నారు. కబడ్డీలో పురుషుల విభాగం నుంచి రాచాయపేట టీం విన్నర్‌గా నిలువగా, కబడ్డీ మహిళల విభాగంలో గోపవరం టీం విన్నర్‌గా, వాలీబాల్‌లో పురుషుల విభాగం నుంచి రాచాయపేట టీం విన్నర్‌గా, వాలీబాల్‌లో మహిళా విభాగం నుంచి బ్రాహ్మణపల్లె టీం విన్నర్‌గా, బాడ్మింటన్ మహిళా విభాగంలో బ్రాహ్మణపల్లె టీం విన్నర్స్‌గా ఎంపికయ్యారు. అలాగే బాడ్మింటన్ పురుషుల విభాగంలో బ్రాహ్మణపల్లె టీం విన్నర్‌గా, ఖోఖో పురుషుల విభాగంలో రాచాయపేట టీం విన్నర్స్‌గా, క్రికెట్‌లో బ్రాహ్మణపల్లె టీం విన్నర్‌గా ఎంపికైంది. కాగా గత నెల 25వ తేదీ నుంచి గ్రామ, మండల స్థాయిలో జరిగిన క్రీడలు పోటీపోటీగా జరిగాయి. క్రికెట్‌లో విన్నర్స్‌గా నిలిచిన బ్రాహ్మణపల్లె టీంను సర్పంచ్ కలువాయి లక్ష్మీదేవి అభినందించి మెమెంటోను అందజేయడంతోపాటు నగదు బహుమతిని ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాయినాయక్, ఈఓపీఆర్‌డీ హసీనా, జేసీఎస్ కన్వీనర్ పుల్లయ్య, ఎస్సీ సెల్ కన్వీనర్ తిరుపాలు, గోపవరం, బ్రాహ్మణపల్లె పంచాయతీ కార్యదర్శులు విజయకుమార్, మోషే తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల : మండల స్థాయిలో జరిగిన ‘ఆడుదాం ఆంధ్రాకు’ క్రికెట్ పోటీల్లో ఫైనల్‌కు చేరిన నాగలకుంట్ల, గానుగపెంట సచివాలయాల జట్లు శుక్రవారం తలపడ్డాయి. నాగలకుంట్ల 62 పరుగులతో విజయం సాధించి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఎంపీడీఓ వరప్రసాదరావు, ఎంఈఓ రత్నస్వామి ప్రకటించి, నాగలకుంట్ల జట్టును అభినందించారు. పోటీల నిర్వహణలో పీఈటీలు భాస్కర్‌రెడ్డి, రామకృష్ణ, హరినాథరెడ్డి పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠంలో..

బ్రహ్మంగారిమఠం : బి.మఠంలో రేకలకుంట–సోమిరెడ్డిపల్లె1 క్రీడాకారులు పురుషులు క్రికెట్‌లో పోటీపడ్డారు. ఇందులో సోమిరెడ్డిపల్లె జట్టు విజేతగా నిలిచింది. అలాగే స్త్రీలు సోమిరెడ్డిపల్లె జట్టు విజేతగా నిలిచింది. బ్యాట్‌మెంటన్‌లో పురుషులు మల్లేపల్లె, బ్యాట్‌మెంటన్‌లో మహిళలు సోమిరెడ్డిపల్లె2, కబడ్డీ పురుషులు సోమిరెడ్డిపల్లె, కబడ్డీ మహిళలు మల్లేపల్లె, వాలీబాల్‌లో పురుషులు నాగిశెట్టిపల్లె, వాలీబాల్‌లో మహిళలు ముదుమాల నియోజకవర్గస్థాయికి ఎంపికయ్యారు. మండలస్థాయిలో గెలుపొందిన విజేతలకు ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, మండల ప్రత్యేక అధికారి నరసింహారెడ్డిలు ట్రోఫీలను అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంగమునిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయికి రామసముద్రం జట్టు పెంపిక

బి.కోడూరు : మండల పరిధిలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా మండలంలోని పది పంచాయతీల పరిధిలో జరిగిన క్రికెట్ టోర్నమెంట్‌లో 10 టీంలు పాల్గొనగా బి.కోడూరు, రామసముద్రం జట్లు ఫైనల్‌కు ఎంపికయ్యాయి. అందుకు సంబంధించి శుక్రవారం ఎంపీడీఓ భాస్కర్‌రావు ఆధ్వర్యంలో పాయలకుంట్ల గ్రామంలో జరిగిన క్రికెట్ ఫైనల్‌లో రామసముద్రం జట్టు విజయం సాధించి నియోజకవర్గ స్థాయికి ఎంపికైంది. విజేతగా నిలిచిన రామసముద్రం జట్టును ఎంపీడీఓ భాస్కర్‌రావు, పంచాయతీ సెక్రటరీ వెంకటసురేంద్ర అభినందించారు.

బహుమతి అందజేత

ప్రొద్దుటూరు కల్చరల్ : క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక రాయలసీమ వ్యాయామ కళాశాలలో ఆడుదాం ఆంధ్ర క్రికెట్ పోటీల్లో పంచాయతీ స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు కొనిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రూ.10 వేలు నగదు బహుమతి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా, రాష్ట్ర స్థాయిలో క్రీడాకారులు రాణించాలని ఆకాంక్షించారు.

వెయ్యి మందికి చీరెల పంపిణీ



చీరెలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, పోరెడ్డి నరసింహారెడ్డి

ప్రొద్దుటూరు : సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకుని పోరెడ్డి సుజాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోరెడ్డి నరసింహారెడ్డి కుటుంబీకులు 1000 మంది పేదలకు శుక్రవారం చీరెలను పంపిణీ చేశారు. బొల్లవరం వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ పుట్టిన ఆడ పిల్లల పేరుతో ఎంతోకొంత డబ్బును డిపాజిట్ చేసి బాండ్లు వారికి ఇస్తే పెళ్లి నాటికి ఉపయోగపడుతుందని.. సుజాత శుభమస్తు కార్యక్రమాన్ని నిర్వహించాలని వారికి సూచించారు. కాలేజి చదువుకునేటప్పుడు పోరెడ్డితోపాటు కాకర్ల నాగేశారెడ్డి తనకు సీనియర్ విద్యార్థులు అని, నాటి నుంచి నేటి వరకు మా పరిచయం అలాగే కొనసాగుతోందన్నారు. కరోనాలో ఆయన సతీమణి మృతి చెందాక పోరెడ్డి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. పోరెడ్డి నరసింహారెడ్డి మాట్లాడుతూ మార్చి 20వ తేదీన తన సతీమణి సుజాత జయంతి ఉందని, ఎన్నికల కోడ్ వస్తుందనే కారణంతో ఇప్పుడు ఈ కార్యక్రమాన్ని నిర్వహించానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షులు కామిశెట్టి బాబు, కోనేటి సునంద, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగేశారెడ్డి, శ్రీశైలం ట్రస్టు బోర్డు మెంబర్ రామేశ్వరి, పోరెడ్డి సందీప్, అనూష, పోరెడ్డి ప్రదీప్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ఖరీదైన వైద్యం



ప్రొద్దుటూరు క్రైం : మందుల కిట్‌ను అందచేస్తున్న డాక్టర్ శ్రీనివాస్



అట్లూరు : వైద్య శిబిరంలో పాల్గొన్న నాయకులు, వైద్యులు

ప్రొద్దుటూరు క్రైం : జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల నిర్వహణతో పేద, మధ్యతరగతి ప్రజలకు ఖరీదైన వైద్యం లభిస్తోందని డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని సోములవారిపల్లె మూడవ సచివాలయం పరిధిలో ఉన్న పెన్నానగర్ ప్రభుత్వ ఉర్దూ పాఠశాలలో శుక్రవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 365 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ శ్రీనివాస్‌తో పాటు స్పెషలిస్టు వైద్యులు అనూష, ఫర్హానా, ప్రణీత్‌కుమార్, కంటి వైద్యులు రఘురామిరెడ్డి వైద్య సేవలను అందించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు వరం

అట్లూరు : జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేదల పాలిట వరంలా మారిందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ముదుమాల ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి అందూరు రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కొండూరు ఎస్టీ కాలనీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్ – 2 కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య బృందం 245 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేయడంతో పాటు వారి వారి వ్యాధితీవ్రతలను బట్టి పలు ఆసుపత్రులకు రెఫర్ చేశారు. అనంతరం జగనన్న సురక్ష కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్డిపల్లె మాజీ సర్పంచ్ లక్ష్మీనరసారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు లక్ష్మిరెడ్డి, వెంకటేష్, పెంచల్‌రెడ్డి, వైద్యాధికారులు డాక్టర్ హమీదాబేగం, డాక్టర్ మాధవి, పంచాయతీ కార్యదర్శి ఆనందరావు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై సత్వరమే స్పందించాలి

పలు గ్రామాల్లో పర్యటించిన ట్రాన్స్ కో ఎస్ఈ రమణ



నక్కలదిన్నెలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ట్రాన్స్ కో ఎస్ఈ రమణ

చాపాడు : విద్యుత్ సమస్యల పట్ల ప్రజలకు ఎప్పటికప్పుడు విద్యుత్‌శాఖ సిబ్బంది అందుబాటులో ఉంటూ స్పందించాలని జిల్లా ట్రాన్స్ కో ఎస్ఈ రమణ తెలిపారు. మండలంలోని నక్కలదిన్నె విద్యుత్ సబ్‌స్టేషన్‌తో పాటు గ్రామాలలోని వ్యవసాయ, గృహ అవసరాల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను, విద్యుత్ లైన్లను క్షేత్రసాయిలో శుక్రవారం ట్రాన్స్ కో ఎస్ఈ పరిశీలించి మాట్లాడారు. విద్యుత్ సబ్ స్టేషన్‌లలో ప్రభుత్వ నిబంధనల మేరకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టాలన్నారు. విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలపై వచ్చినప్పుడు విద్యుత్ శాఖా సిబ్బంది, అధికారులు వారి సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించాలన్నారు. విద్యుత్ చౌర్యాన్ని అరికట్టాలని కాలిపోయిన స్తంభాలను, విద్యుత్ లైన్లను ఎప్పటికప్పుడు మార్చాలని సూచించారు. ప్రజల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు బాధితుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో మైదుకూరు సబ్ డివిజన్ డీఈఈ శ్రీనివాసులరెడ్డి, చాపాడు మండల ఏఈ సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయాల నిరోధానికి కఠిన చర్యలు

మైదుకూరు : విద్యుత్ సరఫరాలో అంతరాయాల నిరోధానికి కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్, అన్నమయ్య ఉమ్మడి జిల్లాల పర్యవేక్షక ఇంజనీర్ ఎస్.రమణ తెలిపారు. శుక్రవారం మైదుకూరు సబ్ డివిజన్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. విద్యుత్ అంతరాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. రాబోవు వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని వినియోగదారుల సౌకర్యం కోసం ఎప్పటికప్పుడు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తూ, లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ ఎప్పటికప్పుడు చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం చూపే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డీఈఈ శ్రీనివాసులురెడ్డి, మైదుకూరు, ఖాజీపేట, చాపాడు, దువ్వూరు మండలాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

16న బండలాగుడు పోటీలు

చాపాడు : మండలంలోని వెదురూరులో వెలసిన శ్రీ పార్వతి సమేత సంఘమేశ్వరస్వామి సన్నిధిలో మకర సంక్రాంతి వేడుకలు వైభవంగా జరగనున్నాయి. వెదురూరుతో పాటు సమీపంలోని నరహరిపురం గ్రామం వద్ద సంక్రాంతి కనుమ పార్వేట సందర్భంగా మంగళవారం మధ్యాహ్నం 2గంటల నుంచి రాష్ట్ర స్థాయిలో వృషభరాజములచే బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. రెండు చోట్ల గెలుపొందిన ఎడ్ల ఎజమానులకు వేర్వేరుగా రూ.1,00,116లు, రూ.70,116లు, రూ.40,116లు, రూ.20,116లు, రూ.10,116లు చొప్పున నగదు అందజేయనున్నారు. ఇదే రోజు రాత్రి 9.30గంటల నుంచి సంఘమేశ్వరుడి గ్రామోత్సవ వేడుకలు నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు.

ముగ్గురు పేకాటరాయుళ్ల అరెస్టు

కాశినాయన : మండలంలోని బాలాయపల్లె గ్రామంలో శుక్రవారం పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.5630 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ అమర్‌నాథరెడ్డి తెలిపారు. శనివారం కోర్టులో హాజరుపరుస్తామన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలకు ఎవరైనా పాల్పడితే తమ దృష్టికి తీసుకురావాలని ఎస్ఐ తెలిపారు. బెల్టుషాపులు, పేకాట ఆడుతున్న వారి వివరాలను తమకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు వెంకటసుబ్బయ్య, దాదావలి తదితరులు పాల్గొన్నారు.

యువత దేశానికి విలువైన సంపద

వైవీయూ : స్వామి వివేకానందుని మాటలు తారక మంత్రాలుగా భావించి స్వశక్తితో ఎదిగే ప్రయత్నం చేస్తే యువత దేశానికి విలువైన సంపదగా నిలుస్తారని ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి అన్నారు. వైవీయూ జాతీయ సేవాపథకం, నెహ్రూ యువ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలను వైవీయూలో నిర్వహించారు. వైవీయూ వీసీ చింతా సుధాకర్, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథ్ రెడ్డి, నెహ్రూయువ కేంద్రం సమన్వయకర్త మణికంఠలు స్వామి వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి , ఆచార్య చింతా సుధాకర్ మాట్లాడుతూ గొప్పజ్ఞాని స్వామి వివేకానందుడని పేర్కొన్నారు.

పది పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించాలి



రూట నాయకులతో కలిసి పది స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం అంజాద్‌బాష

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రవ్యాప్తంగా పదవ తరగతి పరీక్షల్లో ఉర్దూ మీడియం విద్యార్థులందరూ ఉత్తమ మార్కులను సాధించాలని డిప్యూటీ సీఎం అంజాద్ బాష కోరారు. కడపలోని డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో శుక్రవారం డిప్యూటీ సీఎం అంజాద్‌బాష మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఉర్దూ మీడియం సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్ ముద్రించిన పదవ తరగతి స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉర్దూ మీడియం పదో తరగతి విద్యార్థులందరికీ ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను అందిస్తామన్నారు. పదవ తరగతి పరీక్షలో ఉత్తమ మార్కులు సాధించేందుకు ఈ స్టడీ మెటీరియల్ ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్ (సిఇడిఎం) డైరెక్టర్ మస్తాన్‌వల్లి, అసోసియేట్ మునీర్, రూట వ్యవస్థాపకులు సయ్యద్ హిదయతుల్లా, రూట రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్, రూట రాష్ట్ర నాయకులు మహమ్మద్ అయ్యూబ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక శిఖరం స్వామి వివేకానంద



శోభాయాత్రను ప్రారంభిస్తున్న సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి ప్రభాకర్‌రెడ్డి



కాశినాయన : దుస్తులు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులు, ప్రతినిధులు



పోరుమామిళ్ల : ఎస్ఐకి చిత్రపటాన్ని బహుకరిస్తున్న డాక్టర్ మార్కారెడ్డి



కాశినాయన : గోశాలను ప్రారంభించిన పీఠాధిపతి విరజానందస్వామిజీ

బద్వేలు అర్బన్ : భారతీయులందరూ గర్వంగా చెప్పుకోదగిన ఆధ్యాత్మిక శిఖరం స్వామి వివేకానంద అని సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. స్వామి వివేకానంద జయంతి, యువజన దినోత్సవం సందర్భంగా శుక్రవారం రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో స్థానిక రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాల నుంచి నాలుగు రోడ్ల కూడలి మీదుగా పట్టణంలో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మానవుడు తన బుద్ధిని సక్రమ మార్గంలో పెట్టుకోవడానికి పెద్దవాళ్లు, మహనీయుల చరిత్రలను తెలుసుకోవాలన్నారు. శోభాయాత్రలో ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. కార్యక్రమంలో అర్బన్ సీఐ యుగంధర్, ఎస్ఐ సత్యనారాయణ, ఎంవీఐ శేఖర్‌రావు, కళాశాల ఏఓ, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆర్.వి.సాయిక్రిష్ణ, రామకృష్ణ సేవాసమితి కార్యవర్గం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

కాశినాయన : మండలంలోని వరికుంట్ల ఎస్టీకాలనీ వాసులకు శుక్రవారం జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా 70 మందికి దుప్పట్లు, పంచెలు, చీరలను వివేకానంద ఫౌండేషన్ వ్యవస్థాపకులు రామకృష్ణారెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఘనంగా వివేకానంద జయంతి వేడుకలు

కాశినాయన : మండలంలోని ఓబుళాపురం సగిలేరు ఒడ్డున ఉన్న వివేకానంద సేవాశ్రమంలో శుక్రవారం వివేకానంద ఫౌండేషన్ నిర్వాహకులు రామకృష్ణారెడ్డి, రామతులసిల ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 162వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా అచలానంద ఆశ్రమ పీఠాధిపతి విరజానందస్వామిజీ హాజరై వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దాతల సహకారంతో వివేకానంద గోశాలను ఆయన ప్రారంభించారు. అనంతరం గోపూజ నిర్వహించారు. కార్యక్రమంలో వివేకానంద సేవాశ్రమ ప్రతినిధులు గురుమూర్తి, మదిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శివ, రోశిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, పీరారెడ్డి, ప్రసాద్, జయరాం, నాగవేణి, శ్రావణి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో..

పోరుమామిళ్ల : స్వామి వివేకానంద 162వ జయంతి ఉత్సవాలు శుక్రవారం పోరుమామిళ్లలో వివేకానంద చైతన్య సమితి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్ఐ మల్లికార్జునరెడ్డి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రపంచానికి చాటిన మహనీయుడని కొనియాడారు. రిటైర్డు డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ మార్కారెడ్డి స్వామి వివేకానందుని సూక్తులు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, ఆయన మార్గం అందరికీ ఆచరణీయమన్నారు. ఉత్సవాల్లో కోలాటం ప్రదర్శించిన బృందానికి కీ.శే. ఉపాధ్యాయుడు ఎస్‌బీఎల్ నారాయణమూర్తి కుమారుడు శ్రీకాంత్ బహుమతులు అందజేశారు. ఉత్సవాల్లో వివేకానంద చైతన్య సమితి గౌరవ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, అధ్యక్షులు మధుసూధనరావు, పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షులు గురుమూర్తి, జనహిత మాతాజీలు, ఆచార్యులు పాల్గొన్నారు.